అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


మహిళా రైతుకు పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుపూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులతో పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత రాష్ట్ర చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని కొనియాడారు. పార్టీల ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, సైడు కాలువలు, తాగునీటి పథకాలు నిర్మించామని వివరించారు. అలాగే దశాబ్దాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, లబ్ధిదారులకు హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలు సాగు చేసుకునే భూములకు టీడీపీ హయాంలో పట్టాలు పంపిణీ చేసే విషయాన్ని పట్టించుకోని సోమిరెడ్డి, తమ ప్రభుత్వంలో పేదలకు మేలు చేస్తుంటే తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా సర్వేపల్లిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి


ఎంపీడీఓ రామాంజనేయులుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

- డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా దృష్టి సారించాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడా పొరపాటు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీలు శివుని నరసింహారెడ్డి, సాయిలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు.

క్లుప్తంగా

ఎస్సై శివకృష్ణారెడ్డికి ఘన సన్మానం



ముత్తుకూరు : మండలంలో నాలుగున్నర ఏళ్లకుపైగా సేవలు అందించిన ఎస్సై శివకృష్ణారెడ్డి అన్నివర్గాల మన్ననలు, అభిమానం చూరగొన్నారని పలువురు వక్తలు కొనియాడారు. ముత్తుకూరు ఎస్సైగా పనిచేస్తూ ఇటీవల నెల్లూరు ఎస్బీకి బదిలీ అయిన శివకృష్ణారెడ్డిని ఆదివారం మత్స్యకళాశాల ఆడిటోరియంలో ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి, అదానీ కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ జీఎం వెంకటేష్ భాస్కరన్, పి.హేమంత్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసులురెడ్డి, శివనాంచారయ్య, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శివకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి

నెల్లూరు(దర్గామిట్ట): సీఎం సహాయనిధి ద్వారా బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా నిలుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి రూ.10.25 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను డైకస్‌రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అనేక వ్యాధులను చేర్చి వైద్యసేవలను సమర్థంగా అందిస్తున్నారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు సంబంధించి బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు.

వీనులవిందుగా గాత్రకచేరి



నెల్లూరు(బృందావనం): గట్టుపల్లి లలితాంబ శతజయంతిని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో అన్నమయ్య సౌరభాలు కార్యక్రమాన్ని సంగీత కళాకారుల ఆధ్వర్యంలో గసల్ సేవా సంస్థ నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. మృదంగ కళాకారుడు, కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసుడు కానూరి వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన గాయకులు వాసాప్రసాద్, వైష్ణవి ఆలపించిన అన్నమాచార్య కీర్తనలకు చావలి ప్రసాద్, సాయి, లక్ష్మీనారాయణ వాద్యసహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. బాలార్క, పద్మాసిని, విద్యాసాగర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, గట్టుపల్లి ఆదిశేషు, డీవీఎస్ శాస్త్రి, దుర్గా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9న వెంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరం వద్ద శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల తొమ్మిదిన నిర్వహించనున్నామని వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను బాలాజీనగర్‌లోని సేవా సమితి కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి గోత్రనామాలతో పూజలు నిర్వహించి.. వేదపండితుల ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు, ముత్యాల తలంబ్రాలను అందజేయనున్నామని వివరించారు.

'ఎస్సార్కే'లో పుస్తకావిష్కరణ

నెల్లూరు రూరల్: మాగుంట లేఅవుట్లోని ఎస్కార్కే స్కూల్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రూపొందించిన విద్య, ఉపాధి, ఉద్యోగ పుస్తకాన్ని ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత వైస్ చాన్సలర్ మురళి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి విద్యారంగానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పుస్తకాన్ని ఉపాధ్యాయులు చదివి విద్యార్థులకు తగిన మార్గాన్ని నిర్దేశించాలని కోరారు. పుస్తకాన్ని ఉచితంగా అందించడాన్ని అభినందించారు. పుస్తక వ్యాసకర్తలు గోపీకృష్ణ, చెంగల్‌రాయశెట్టి, రమణయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, సురేష్, గమనం, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకారం ప్రశంసనీయం

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా


గ్రంథాలయానికి బీరువాలను వితరణగా ఇస్తున్న దాత నీలకంఠరెడ్డి

కొడవలూరు: గ్రంథాలయ అభివృద్ధికి దాత అందించిన సహకారం ప్రశంసనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కుమార్‌రాజా కొనియాడారు. మండలంలోని యల్లాయపాళెం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలను భద్ర పరుచుకునేందుకు రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కరేటి నీలకంఠరెడ్డి రూ.25 వేల విలువైన రెండు బీరువాలు ఆదివారం వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కుమార్‌రాజా మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహద పడుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని దాత సహకారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో దాతను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు భాషా సమితి అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏకొల్లు యుగంధర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ కట్టా ప్రభాకర్‌రెడ్డి, కరేటి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి రాఘవరెడ్డి, ఏటూరి పెంచలరెడ్డి, మందిపాటి వినయ్‌కుమార్‌రెడ్డి, మన్నవరపు సుధాకర్, తమ్మిరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొదలకూరు : ప్రపంచ కేన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మార్వో కాలనీలో వైద్యాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆదివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు, తంబాకు, గుట్కా ఇతర పొగాకుతో తయారు చేసే పదార్థాల వల్ల కేన్సర్ వస్తుందన్నారు. సిగరెట్, బీడీలు తాగవద్దని తెలిపారు. మహిళల్లో అధికంగా రొమ్ము, థైరాయిడ్, గర్భాశయ అండాశయ కేన్సర్లు వస్తున్నట్లు వివరించారు. 40 ఏళ్లు దాటిన మహిళలు అనుమానం ఉంటే దగ్గరలోని కేన్సర్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణాధికారి మస్తానబీ, సహాయకులు రాధాకుమారి, సుమాంజలి, సచివాలయ ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆశావర్కర్లు సీత, లక్ష్మి, ఉష పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


రామన్నపాళెంలో కాలువల పూడికతీత

కొడవలూరు : మండలంలోని రామన్నపాళెంలో సర్పంచ్ కె.ధనమ్మ ఆధ్వర్యంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలోని డ్రెయినేజీ కాలువలు పూడికతో నిండి ఉండడం, రోడ్ల వెంబడి చెత్తా చెదారాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉండేది. దీంతో సర్పంచ్ ధనమ్మ ఆదివారం రోడ్ల వెంబడి చెత్తను తొలగించడంతో పాటు డ్రెయినేజీ కాలువల్లో పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడికతీత పనులు పూర్తయ్యాక గ్రామంలో ఫాగింగ్ చేయిస్తామని, తద్వారా దోమల బెడదను పూర్తిగా నివారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భగవద్గీత ప్రచారం



విరువూరులో ప్రచారం చేస్తున్న కమిటీ బాధ్యులు

పొదలకూరు : మండలంలోని విరువూరు, సూరాయపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆధ్యాత్మికతపై అవగాహన కల్పించి దేవాలయాల్లో రహస్యాలు, హిందుత్వంలో సాంప్రదాయాలు, పండగల విశిష్టతలను వివరించారు. వేమన పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేసి ఆచరించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నర్సయ్య, సభ్యులు కొండయ్య, భాగ్యమ్మ, కృష్ణయ్య, గాయత్రి, నర్సారెడ్డి, సరోజనమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోటకు వెళ్లి పెన్షన్ అందజేత


కామాక్షమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అన్వేష్

ముత్తుకూరు : ముత్తుకూరుకు చెందిన వృద్ధురాలు పుచ్చలపల్లి కామాక్షమ్మ అనారోగ్యంతో తిరుపతి జిల్లా, కోట మండలం, తిన్నెలపూడిలో బంధువుల ఇంట విశ్రాంతి తీసుకుంటోంది. కాగా ఆమెకు ఇవ్వాల్సిన పింఛన్ నగదును ముత్తుకూరు–3 సచివాలయ పరిధిలోని అన్వేష్ అనే వలంటీర్ సుమారు వంద కిలోమీటర్లు ప్రయాణించి తిన్నెలపూడిలోని వారి ఇంటికి వెళ్లారు. వృద్ధురాలి బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ నగదును అందజేశారు. దీంతో ఆమె ఆదివారం ఎంతో ఆనందం వ్యక్తం చేసింది.

వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు


వెంకటాచలంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు


మనుబోలు : స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు


ముత్తుకూరు : వైఎస్సార్ విగ్రహం వద్ద మంత్రి కాకాణికి జేజేలు పలుకుతున్న పార్టీ శ్రేణులు


తోటపల్లిగూడూరు : నరుకూరు సెంటర్‌లో స్వీట్లు పంచుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పొదలకూరు : నెల్లూరు జిల్లా కోర్టులో ఫైళ్ల మిస్సింగ్ కేసులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వడంతో మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ వద్ద బాణసంచా కాల్చి ఒకరికొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ నేత సోమిరెడ్డి ఆపసోపాలు పడి తమ నాయకుడిని కేసులో ఇరికించాలని ప్రయత్నించాడని, అయితే మంత్రి కాకాణి ఎలాంటి తప్పు చేయలేదని నిరూపితమైందన్నారు. సోమిరెడ్డి ఆరోపణలను సీబీఐ కొట్టిపారేసిందన్నారు.

వెంకటాచలంలో..

వెంకటాచలం: నెల్లూరు కోర్టులో చోరీ కేసుకు సంబంధించి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఎలాంటి పాత్రలేదని సీబీఐ తేల్చి చెప్పడంతో వెంకటాచలంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. జిల్లా రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎలాంటి మచ్చలేని నాయకుడిగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలియజేశారు. ఇప్పటివరకు కాకాణిపై లేనిపోని ఆరోపణలు చేసిన వ్యక్తులు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ఆరోపణలు మానండి

మనుబోలు : మంత్రి కాకాణిపై ఇకనైనా టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం మానాలని వైఎస్సార్‌సీపీ నేతలు హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఆదివారం మనుబోలులో టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులో ఫైళ్ల దొంగతనం ఘటనలో తమ నాయకుడు కాకాణి ప్రమేయం ఉందంటూ చంద్రబాబు నుంచి సోమిరెడ్డి వరకు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కాకాణి ధైర్యంగా సీబీఐ విచారణను ఎదుర్కొని కడిగిన ముత్యంలా బయటపడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఎంవీబీరెడ్డి, ముంగర రవీంధర్‌రెడ్డి, గుంజి రమేష్, దాసరి మహేంద్రవర్మ, చలగల దయాకర్, గిద్దంటి రమణయ్య, దేశిరెడ్డి హరనాథ్‌రెడ్డి, చల్లా నవకోటి, కోసూరు కోటేశ్వరగౌడ్, దువ్వూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్తుకూరులో..

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కోర్టులో జరిగిన చోరీకి ఎలాంటి సంబంధం లేదని సీబీఐ నిర్ధారించడంతో ముత్తుకూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం సంబరాలు చేసుకున్నాయి. ఇందులో భాగంగా స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్‌బాషా, యల్లంగారి వెంకటేశ్వర్లు, పార్టీ నేత కె.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, కోర్టులో చోరీ కేసుకు సంబంధించి మంత్రి కాకాణికి సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కాకాణిపై గతంలో ఆరోపణలు చేసిన టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్, సోమిరెడ్డి తేలుకుట్టిన దొంగల్లా మారారని దుయ్యబట్టారు. గండవరం సూరి, షేక్.మస్తాన్, టి.రాజ, సాయికృష్ణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నేత కాకాణి

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మచ్చలేని నేత అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ పేర్కొన్నారు. కోర్టులో ఫైళ్ల చోరీ కేసులో మంత్రి కాకాణి పాత్ర ఏమీ లేదని సీబీఐ తేల్చి చెప్పడంతో ఆదివారం మండల పరిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో నరుకూరు సెంటర్‌లో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ సోమిరెడ్డికి ప్రజా మద్దతు లేకపోవడం వల్లే కాకాణిపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఎడిచర్ల శ్రీనివాసులుగౌడ్, ఆకుల మధు, వేగూరు శ్రీనివాసులు, ముసలి పరంధామయ్య, ఉడా కిశోర్, నవీన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల దూకుడు


బస్టాండ్ లోపల ఆటోను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

పొదలకూరు : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆటోల దూకుడుకు ఆర్టీసీ కుదేలవుతోంది. బస్సులు సకాలంలో రాకపోవడం వల్ల ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. సాధారణంగా బుధ, గురు, శనివారాల్లో బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇందుకు తగిన విధంగా ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌కు రాకపోవడం వల్ల ఆటోడ్రైవర్లు బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. ఆర్టీసీకి సంబంధించిన లోడర్ పోస్టు ఇక్కడ లేకపోవడం వల్ల ఆటోలు విచ్చలవిడిగా బస్టాండ్ లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లడం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పడిపోతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు బస్సులు వస్తే నాలుగైదు ఒకే సమయంలో రావడం.. లేదంటే ఒక్క బస్సు కూడా బస్టాండ్‌కు రాకపోవడం వల్ల ప్రయాణికులు విసిగిపోయి ఆటోలను ఎక్కి నెల్లూరుకు చేరుకుంటున్నారు. ఈ పరిస్థితి చాలా కాలంగా కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేయలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై వెంటనే అధికారులు చొరవ తీసుకుని బస్సుల సమయాలను ప్రయాణికులకు అనుకూలంగా ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై నేటి నుంచి అవగాహన

నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఫేజ్ – 2లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని 28 ప్రాంతాల్లో ప్రచార వాహనం, శిబిరాల ద్వారా సోమవారం నుంచి రెండు వారాల పాటు అవగాహన క్యాంపులను నిర్వహించనున్నామని వివరించారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం.. అవగాహన.. ఆధార్ అప్‌డేట్.. బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు తదితరాలపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు.